సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 16 । మార్చి । 2025



నీళ్లు లేక నెర్రెలు
బోర్లు అడుగంటడంతో వరి చేలకు నీరందక ఎండిపోతున్నాయి.ఎండిన పొలాల్లో పశువులను మేపుతున్నారు. -9లో



అటకెక్కిన పరిశోధన కేంద్రం
దండుమల్కాపురం పరిధిలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫ్లోరైడ్ పరిశోధన కేంద్రం పనులు ముందుకు సాగడం లేదు. - 10లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-32 (సోమవారం సా॥)
సహర్ 5-01 (ఆదివారం ఉ॥)

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 4,590 మంది హాజరు

భువనగిరి : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 4,730 మందికి గాను 4,590 మంది హాజరయ్యారు. 140 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు.

పోరుబాటతో ప్రజా సమస్యలు వెలుగులోకి..


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు జహంగీర్ తదితరులు

యాదగిరిగుట్ట: సీపీఎం చేపట్టిన పోరుబాట కార్యక్రమంతో ప్రజా సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో శనివారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ సర్కార్ పదేళ్లలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని విమర్శించారు. హామీల్లో ఒకటి, రెండు తప్ప ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. పోరుబాటలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 27, 28, 29 తేదీల్లో తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల ముట్టడి, ఏప్రిల్ రెండవ వారంలో కలెక్టరేట్ ఎదుట 48 గంటల మహాధర్నా నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు పోరుబాట కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి మల్లేశం, బబ్బూరి పోశెట్టి, గడ్డం వెంకటేష్, పెద్దకందుకూరు మాజీ సర్పంచ్ భీమగాని రాములు, బీమగాని మాధవి, మండల కమిటీ సభ్యులు కాలే స్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.2వేల కోట్లు కేటాయిస్తేనే ప్రయోజనం


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

మోత్కూరు : రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిఫ్ట్, చేనేత భరోసా పథకాలను ప్రకటించినా ఇప్పటి వరకు కార్యాచరణ రూపొందించలేదన్నారు. గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేసిందని, కాంగ్రెస్ సర్కార్ కూడా అదే బాటలో నడుస్తుందన్నారు. చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ అప్పు మాఫీ చేయాలని, ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోచం కన్నయ్య మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రెండు చీరలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ, వాటిని నేసే బాధ్యత పవర్‌లూమ్ యజమానులకు అప్పగించిందన్నారు. సమావేశంలో చేనేత సంఘం నాయకులు వంగరి రాములు, చుంచు లక్ష్మయ్య, వేముల నర్సయ్య, శ్రీనివాస్, దోర్నాల మత్స్యగిరి, జెల్ది సోమయ్య, పెండెం రాజారామ్, ఏలూరి మత్స్యగిరి, పోచం రాము, వాసు పాల్గొన్నారు.

జియో ట్యాగ్ నంబర్లు కేటాయించాలని వినతి


సన్మానం చేస్తున్న చేనేత కార్మికులు

భువనగిరిటౌన్: జియో ట్యాగింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న చేనేత కార్మికులకు వెంటనే నంబర్లు కేటాయించాలని కోరుతూ చేనేత కార్మిక సంఘం సభ్యులు శనివారం చేనేత, జౌళీ శాఖ ఏడీకి వినతిపత్రం అందజేశారు. జియో ట్యాగింగ్ కోసం జిల్లాలో సుమారు 2వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, నంబర్ కేటాయించకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే జియోట్యాగ్ నంబర్ తప్పనిసరి చేసిందన్నారు.అనంతరం ఏడీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన వెల్లువ


మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, చిత్రంలో చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయండి

భువనగిరి : తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను కూడా సంసిద్ధులను చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పదో తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఆయా తేదీల్లో ప్రతి రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పదో తరగతికి మొదటి సెషన్, మధ్యాహ్నం రెండో సెషన్‌లో ఇంటర్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షల టైమ్ టేబుల్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని, హాల్ టికెట్‌లను కూడా త్వరలో అందుబాటులో ఉంచుతారని పేర్కొన్నారు. అదే విధంగా ఏప్రిల్ 26నుంచి మే5వ తేదీ మధ్య జరిగే ప్రాక్టికల్స్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను సబ్జెక్టుల వారీగా త్వరలో విడుదల చేస్తారని వివరించారు.

వృథా అరికట్టకపోతే కటకటే!

వేసవి ప్రారంభంతోనే తాగునీటి ఎద్దడి

- డిమాండ్ మేరకు సరఫరా కాని మిషన్ భగీరథ జలాలు
- పైపులైన్ లీకేజీలు, సాంకేతిక సమస్యలు
- పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ రూపొందించిన యంత్రాంగం
- అవసరమైన చోట అద్దెబోర్లు, అదనపు పైపులైన్ల ఏర్పాటు
- ట్యాంకర్లతో సరఫరా చేయాలని నిర్ణయం


భువనగిరి మండలం హన్మాపురంలో తాగునీటి కోసం ఇటీవల రోడ్డెక్కిన ప్రజలు(ఫైల్)

సాక్షి, యాదాద్రి : భానుడు రోజురోజుకూ మండిపోతున్నాడు. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో మంచినీటి ఎద్దడి తరుముకొస్తోంది. మిషన్ భగీరథ నీరు డిమాండ్‌కు అనుగుణంగా సప్లయ్ కాకపోగా.. వచ్చే నీటిలోనూ కొంతమేర లీకేజీలు, సాంకేతిక సమస్యలు ఏర్పడినప్పుడు వృథా అవుతోంది. ప్రమాదాన్ని ముందస్తుగా గుర్తించిన యంత్రాంగం.. జిల్లాలోని 17 మండలాల్లో నీటి సరఫరా స్థితిగతులను పరిగణలోకి తీసుకుని సమస్యను అధిగమించేందుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించింది. అవసరమైన చోట ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకోవాలని, ట్యాంకర్ల దారా నీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. అంతేకాకుండా నీటి వృథాను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలకు ఉపక్రమించింది.

719 ఆవాసాలకు భగీరథ నీరు

జిల్లాలోని 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీల పరిధిలోని 719 ఆవాసాలకు మిషన్ భగీరథ సరఫరా జరుగుతుంది. ఇందులో 512 ఆవాసాలకు హైదారాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా, 131 ఆవాసాలకు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, 69 గ్రామాలకు నల్లగొండ ఉదయసముద్రం నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 14 ఎంఎల్‌డీలు, ఉదయ సముద్రం నుంచి 10.8 ఎంఎల్‌డీల నీరు ప్రతి రోజూ సరఫరా జరుగుతోంది. ఇక హైదారాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా నిత్యం 80.51 ఎంఎల్‌డీల నీరు రావాల్సి ఉండగా కొద్ది రోజులుగా 47.75 ఎంఎల్‌డీలు మాత్రమే వస్తుంది.

నల్లా కనెక్షన్లు, ట్యాంకులు ఇలా..

జిల్లా వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 1,221 ట్యాంకులు, 353 చేతిపంపులు, 33 బావుల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. మొత్తం 1,56,147 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 642 ఇళ్లకు నల్లాలు లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

రోడ్డెక్కుతున్న జనం

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో జనం ఆందోళనకు దిగుతున్నారు. భువనగిరి మండలం హన్మాపురంలో నీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు ఇటీవల రోడ్డెక్కారు. అదే విధంగా వడపర్తి గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

167 ఆవాసాల్లో ముప్పు

వేసవిలో నీటి ముప్పును గ్రహించిన మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం అధికారులు ఫిబ్రవరిలోనే క్షేత్రస్థాయిలో సర్వే చేసి నీటి ఎద్దడి పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 167 ఆవాసాల్లో ముప్పు ఉందని అంచనా వేశారు. ఈ మేరకు ముందస్తుగానే ప్రత్యామ్నా చర్యలు చేపట్టారు. పుట్టగూడెం, మల్లాపూర్, చాకంపల్లి, ధర్మోజిగూడెం, దేశ్‌ముఖ్, ఎం,తుర్కపల్లి, జనగాం, శ్రీనివాసపురం గ్రామాల్లో ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకున్నారు. అవసరాన్ని బట్టి మరికొన్ని బోర్లను అద్దెకు తీసుకోనున్నారు.

నీటిని వృథా చేయొద్దు

హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా డిమాండ్‌కు అనుగుణంగా నీటి సరఫరా జరగడం లేదు. రోజూ వచ్చే నీటిలో దాదాపు సగానికి తగ్గాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తుతోంది. సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. అవసరమైన ప్రాంతాల్లో అద్దె బోర్లు తీసుకుంటున్నాం. అదనపు పైప్‌లైన్లు వేస్తున్నాం. నీటిని వృథాగా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి.

– కరుణాకర్, మిషన్ భగీరథ ఈఈ

అప్రమత్తంగా ఉండాలి

బీబీనగర్ : తాగునీటి సరఫరా విషయంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామంలో ఆమె శనివారం పర్యటించారు. గ్రామంలో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. నిరుపయోగంగా ఉన్న బోర్లను పరిశీలించారు. ప్రతి ఇంటికీ నీటి స్వచ్ఛమైన నీటి సరఫరా జరగాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికిరణ్, పంచాయతీ కార్యదర్శి బాలలక్ష్మి ఉన్నారు.


నిరుపయోగంగా ఉన్న బోరును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శోభారాణి

● పాదచారికి దారేదీ?


జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఆక్రమించారు. దుకాణాల్లోని వస్తువులు, తోపుడు బండ్లను ఫుట్‌పాత్‌లపైనే పెట్టడంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. – భువనగిరి టౌన్

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత బిడ్డలదే

- సీనియర్ సిటిజన్, సంరక్షణ, పోషణ ట్రిబ్యునల్ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి


విచారణ చేస్తున్న ట్రిబ్యునల్ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ : తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులను పొందడమే కాదు.. వారి సంరక్షణ, పోషణ బాధ్యత బిడ్డలదేనని సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ ట్రిబ్యునల్ ఛైర్మన్ వెల్మ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. చౌటుప్పల్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన బాధితుల నుంచి అందిన ఫిర్యాదులపై శనివారం ట్రిబ్యునల్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఇరుపక్షాలను పిలిపించి వారి వాదనలు విన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ తల్లిదండ్రులంటే ఆస్తులు సంపాదించే వరకే అనుకోవడం దుర్మార్గమన్నారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులను అనుభవిస్తూ వారి మంచిచెడులను మాత్రంపట్టించుకోకపోవడం సరైందికాదన్నారు. ఆస్తులను తమ పేర రాయించుకుని, తల్లిదండ్రులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే కఠిన తీర్పులు ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని, లేనిపక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. తల్లిదండ్రులు ట్రిబ్యునల్‌కు వచ్చి ఫిర్యాదు చేసే పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిబ్యునల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముత్యాల సత్తిరెడ్డి, సెక్షన్ ఇంచార్జి అధికారి సురేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

'కృత్రిమ మేధ'తో విషయ పరిజ్ఞానం


జమీలాపేట పాఠశాలలో కంప్యూటర్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్: విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందింపజేసే విధంగా జ్ఞాపక శక్తితో కూడిన విద్యను అందించాలని కలెక్టర్ హనుమంతరావు ఉపాధ్యాయులకు సూచించారు. బీబీనగర్ మండలం జమీలాపేట జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్–ఏఐ)తో కూడిన బోధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కంప్యూటర్ ద్వారా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ తీరును పరిశీలించారు. విద్యార్థులు గణిత శాస్త్రంలో ప్రగతిని సాధించేందుకు ఉపయోగిస్తున్న ఏఐ టెక్నాలజీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రాయరావుపేట నుంచి నెమురగొముల వైపు ప్రవహిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని పరిశీలించారు.ఇరు గ్రామాల మధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

సులభంగా నేర్చుకోవచ్చు

భువనగిరి : మండలంలోని తుక్కాపురం ప్రాథమిక పాఠశాలలో ఏఐ ఆధారిత బోధన కార్యక్రమాన్ని శనివారం జిల్లా సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి ప్రారంభించారు. ఏఐ బోధనతో వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. రాయడం, చదవడం సులభంగా నేర్చుకోచ్చన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఏఐ ఆధారిత బోధన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈవిధానం చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు సదానంద, జనార్దన్, బ్రహ్మచారి, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్‌బాబు, పద్మ, సునీత పాల్గొన్నారు.


తుక్కాపురం పాఠశాలలో విద్యార్థులకు ఏఐ విధానంలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

ఫీజు బకాయిలు చెల్లించకపోతే పరీక్షలు బంద్


ఎంజీయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాళ్లు

మోత్కూరు : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో వార్షిక పరీక్షలు నిర్వహించబోమని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగిరెడ్డి హెచ్చరించారు. సంఘం కార్యదర్శి ఎం.సైదారావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ సత్యంగౌడ్‌తో కలిసి శనివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ఎగ్జామ్ కంట్రోలర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయవద్దని, ఆర్‌టీఎఫ్ ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని గత, ప్రస్తుత ప్రభుత్వాలు చెప్పాయని గుర్తు చేశారు. కానీ, నెలల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి కళాశాలలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగులకు వేతనాలు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నామని చెప్పారు. ఫీజు బకాయిలు చెల్లించకపోతే 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించలేమని స్పష్టం చేశారు.

ఫిర్యాదు చేస్తే పది రోజుల్లోనే పరిష్కారం

- మున్సిపాలిటీల్లో రెవెన్యూ మేళాలు
- ప్రతి సోమ, గురువారాల్లో ఉదయం 10నుంచి ఒంటి గంట వరకు
- ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- సందేహాల నివృత్తికి సంప్రదించాల్సిన నంబర్ 63042 34141


భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయం

భువనగిరి : ఇంటి పన్ను ఎక్కువగా వస్తుందా.. పన్నుల విధింపులో లోపాలున్నాయా.. ఒకే ఇంటికి రెండు నంబర్లు ఉన్నాయా.. ఇలాంటి సమస్యలు పరిష్కరించేందుకు మున్సిపల్ యంత్రాంగం రెవెన్యూ మేళాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తోంది. ఈనెలాఖరు వరకు మేళాలు కొనసాగనున్నాయి.

ఎక్కువగా ఉన్న సమస్యలు ఇవీ..

జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూర్, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 37,126 నిర్మాణాలు ఉన్నాయి. ప్రధానంగా ఆస్తి పన్ను ఎక్కువగా వస్తుందని, తప్పుడు కొలతలు, ఒకే ఇంటికి రెండు నంబర్లు, ఇంటి నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం, యజమాని పేరు మార్పిడి, నివాస గృహాలకు వాణిజ్య పన్ను రావడం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. వీటితో పాటు రివిజన్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిని పరిష్కరించేందుకు అన్ని మున్సిపాలిటీల్లో రెవెన్యూ మేళాలు నిర్వహిస్తున్నారు. ప్రతి సోమ, గురువారాల్లో మార్చి 31వ తేదీ వరకు మేళాలు నిర్వహించనున్నారు. వాటిలో దరఖాస్తు చేసుకుంటే సమస్యను పరిష్కరిస్తారు. మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులో ఉంచారు.

నిర్మాణాలు ఇలా..

మున్సిపాలిటీ	నిర్మాణాలు
భువనగిరి	14,245
చౌటుప్పల్	6,675
ఆలేరు	4,124
యాదగిరిగుట్ట	4,354
పోచంపల్లి	3,879
మోత్కూర్	3,849

సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లింపు, మదింపునకు సంబంధించి సమస్యలు ఉంటే రెవెన్యూ మేళాలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం. ప్రతి సోమ, గురువారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు అందుబాటు ఉంటారు. రెవెన్యూ మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– రామలింగం, భువనగిరి మున్సిపల్ కమిషనర్

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

సమస్య పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకునే టప్పుడు అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జతపర్చాల్సి ఉంటుంది.
డోర్ నంబర్ కోసం : అసెస్మెంట్ కాపీ
పేరు మార్పునకు: మ్యుటేషన్ కాపీ లేదా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇల్లు తీసేసినట్టయితే ఇంటి పన్ను రద్దు కోసం: ఫొటో, చివరిగా చెల్లించిన ఇంటి పన్ను రశీదు
ఇంటి పన్ను ఎక్కువ వచ్చినట్లయితే : అసెస్మెంట్ కాపీ, ఇంటి ఫొటో, సంబంధిత డాక్యుమెంట్
డబుల్ అసెస్మెంట్ :
ఇంటి నిర్మాణ అ నుమతి,అసెస్మెంట్ నంబర్, మొదటగా చెల్లించిన ఇంటి పన్ను రశీదు.

యాదగిరి క్షేత్రంలో నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. వేకువ జామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చించారు. అనంతరం ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవా హన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.


జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఆలేరురూరల్: ఆర్థిక ఇబ్బందులతో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలేరు పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. భువనగిరి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని కురుమవాడకు చెందిన రాకేష్(25) పాన్ షాపు నడుపుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రాకేష్ శనివారం బైక్‌పై ఆలేరు పట్టణ కేంద్రానికి వచ్చి పెంబర్తిలో దారిలో రైలు పట్టాలపై పడుకున్నాడు. సికింద్రాబాద్ నుంచి వస్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాకేష్ నూతనంగా ఇల్లు నిర్మాణం చేపట్టాడని, దీంతో అప్పులు ఎక్కువై ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

భువనగిరి టౌన్: భువనగిరి పట్టణ శివారులోని హుస్నాబాద్‌లో గల మార్కండేయ స్వామి ఆలయంలో హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి మార్కండేయస్వామి ఆలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీని ధ్వంసం చేసి భక్తులు సమర్పించిన కానుకలను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం పూజారి ఆలయానికి వెళ్లగా.. ఆలయ దర్వాజా పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా హుండీ ధ్వంసమై ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బింగి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ హోంగార్డు మృతి

చివ్వెంల(సూర్యాపేట): ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హోంగార్డు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. చివ్వెంల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన పిట్టల యుగంధర్ (37) హైదరాబాద్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. గతేడాది దసరా పండుగకు బైక్‌పై స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా కుడకుడ గ్రామంలో దంతాలపల్లి–సూర్యాపేట రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్ తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోదాడలో పశు ఔషధ బ్యాంకు

- రాష్ట్రంలో మొదటిసారిగా ఏర్పాటు
- పాడి పశువులకు ఉచితంగా, తక్కువ ధరకే మందుల పంపిణీ
- డాక్టర్ పెంటయ్య చొరవతో ముందుకొస్తున్న దాతలు
- ఇప్పటి వరకు 600 మంది రైతులకు పశువుల మందులు పంపిణీ


పశు ఔషధ బ్యాంకును ప్రారంభిస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు (ఫైల్)


కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల

కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో పశు ఔషధ బ్యాంకు ఏర్పాటైంది. ఇక్కడ పని చేస్తున్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య రైతులకు మేలు చేయాలనే వినూత్న ఆలోచనతో దాతల సహకారంతో పశు ఔషధ బ్యాంకు ఏర్పాటుకు నాంది పలికారు. గేదెలు, జీవాలను ఆరుబయట మేతను మేపేందుకు గతంలో మాదిరిగా బీడు భూములు, ఖాళీ స్థలాలు లేకపోవడంతో వాటికి కావాలిసిన పోషకాలతో కూడిన మేత దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో గేదెలు, జీవాలు ఈనిన తర్వాత ఎదకు రావాల్సిన సమయానికి రావడం లేదు. గేదె నెల రోజులు ఆలస్యంగా కడితే రైతు దాదాపుగా రూ.10వేలను నష్టపోతున్నాడు. రైతులు ఆ విధంగా నష్టపోవద్దని గేదెలు సకాలంలో సూడికట్టాలంటే వాటికి మినరల్ మిక్చర్, కాల్షియం వంటి మందులు ఇవ్వాల్సి ఉంటుంది. పేద రైతులకు వాటిని కొనుగోలు చేసేంత స్థోమత ఉంటలేదు. దీంతో డాక్టర్ పెంటయ్య పశు ఔషధ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఆ ఔషధ బ్యాంకు ద్వారా పాడి రైతులకు పలు రకాల న్యూట్రిషిన్ మందులతో పాటు వ్యాధుల నివారణ మందులను కూడా ఇస్తున్నారు. ఇందులో కొన్ని మందులు ఉచితంగా, మరికొన్ని అతి తక్కువ ధరలకే అందజేస్తున్నారు.

పాడి రైతులకు మేలు చేసేందుకు పశు ఔషధ బ్యాంకు



"పాడిపశువుల, జీవాల పెంపకందారులకు అతి తక్కువ ధరలకే మందులను అందజేసేందుకు దాతల సహకారంతో గత ఏడాది అక్టోబర్‌లో పశుఔషధ బ్యాంకు ఏర్పాటు చేశాం. గేదెలకు ఎంతో ఉపయోగపడే మినరల్ మిక్చర్‌ను తక్కువ ధరకే అందజేస్తున్నాం. న్యూట్రిషన్ మందులతో పాటు రోగనిరోధక మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నాం. ఇప్పటి వరకు 600 మంది రైతులకు పలు రకాల మందులను అందజేశాం.

– డాక్టర్ పెంటయ్య, అసిస్టెంట్ డైరెక్టర్, కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల వైద్యాధికారి

దాతల సహకారంతో...

పాడి రైతులకు ఎక్కువగా ఉపయోగపడే మినరల్ మిక్చర్(ఖనిజ లవణ మిశ్రమం), కాల్షియం టానిక్‌లు అందజేసేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. అమెరికాలో పశువైద్యాధికారిగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి రూ.50వేలు విరాళం ఇవ్వగా ఆ నగదు రివాల్వింగ్ ఫండ్ కింద జమ చేశారు. దానితో పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్శిటీ నుంచి 2 టన్నుల మినరల్ మిక్చర్‌ను కొనుగోలు చేశారు. బయట మార్కెట్‌లో కెజీ రూ.250 అమ్ముతుండగా వైద్యశాలకు గేదెలను తీసుకొచ్చిన పాడి రైతులకు కెజీని కేవలం రూ.50కే విక్రయిస్తున్నారు.

❖ ఇక కోదాడ మండలంలోని కాపుగల్లుకు చెందిన మరో దాత ముత్తవరపు పూర్ణచందర్‌రావు 500లీటర్ల కాల్షియం టానిక్‌ను విరాళంగా ఇవ్వగా లీటరు రూ.1000 ఉండే టానిక్‌ను ఉచితంగా ఇస్తున్నారు. అదే విధంగా లీటరు రూ.1000 ఉండే లివర్ టానిక్ కూడా రైతులకు ఉచితంగా ఇస్తున్నామని డాక్టర్ పెంటయ్య తెలిపారు. వీటితో మరికొందరు దాతలు రూ.5 వేల నుంచి రూ.20వేలకు వరకు నగదు రూపంలో విరాళం ఇచ్చారు. వాటితో గేదెలు, జీవాలు, కోళ్లకు కావాల్సిన పలు రకాల నట్టలమందు, ఐరన్‌టానిక్, పేల మందు, టానిక్ పౌడర్, యాంటి బయాటిక్, జీర్ణ సంబంధిత వంటి వ్యాధులకు సంబంధించిన మందులను స్టాక్ ఉన్నంత మేరకు ఉచితంగా అందజేస్తున్నారు. దాతలు మరింత మంది ముందుకొస్తే వారు అందజేసే నగదును రివాల్వింగ్ ఫండ్ కింద ఏర్పాటు చేసి మరింత మంది రైతులకు ఉచితంగా అందజేయడానికి వీలుంటుందని డాక్టర్ పెంటయ్య అంటున్నారు.

ప్రయాణికుడిపై ఆర్టీసీ డ్రైవర్ దురుసు ప్రవర్తన

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- విచారణకు ఆదేశం



ఎక్స్‌లో స్పందించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు

రామగిరి(నల్లగొండ): ప్రయాణికుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్టీసీ డ్రైవర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. ఆర్టీసీ బస్ భవన్ అధికారులు విచారణకు ఆదేశించారు. వివరాలు.. నల్లగొండలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మాచన రఘునందన్ శనివారం హైదరాబాద్ నుంచి నల్లగొండకు వచ్చేందుకు గాను ఎల్బీనగర్‌లో నాన్‌స్టాప్ బస్సు(టీఎస్ 07 జెడ్ 4038) ఎక్కారు. ఆ బస్సును హయత్‌నగర్‌లో డ్రైవర్ ఆపాడు. అయితే బస్సు హయత్‌నగర్‌లో ఆగదు అని తనకు కంట్రోలర్ చెప్పిన విషయాన్ని బస్సు డ్రైవర్‌కు రఘునందన్ గుర్తుచేశారు. దీంతో డ్రైవర్ తనతో దురుసుగా, అమర్యాదగా మాట్లాడాడని మాచన రఘునందన్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఆయన నల్లగొండ ఆర్టీసీ ఆర్‌ఎంకు, డీఎంకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనికి ఆర్టీసీ బస్ భవన్ అధికారులు ఎక్స్(ట్విట్టర్) ద్వారా స్పందిస్తూ ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నల్లగొండ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శనివారం వినియోగదారుల హక్కుల దినోత్సవం రోజే ఈ ఘటన జరగడం గమనార్హం.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి రిమాండ్

- 22 కిలోల గంజాయి, రెండు కార్లు, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితులు

చౌటుప్పల్ రూరల్: గంజాయి తరలిస్తున్న ఐదుగురిని చౌటుప్పల్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బాలాపూర్‌లోని ఎర్రకుంటకు చెందిన ఎండీ ఇమ్రానుద్దీన్, సంతోష్‌నగర్‌లోని హమీద్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ఆసిఫ్, సంతోష్‌నగర్‌లోని కలేందర్‌నగర్‌కు మోసిన్‌ఖాన్, చాంద్రాయణగుట్టలోని ఆసిఫ్‌బాబానగర్‌కు చెందిన ఎండీ అమీర్, సంతోష్‌నగర్‌లోని భువన్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు రెండు కార్లలో గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పంతంగి టోల్‌ప్లాజా వద్ద వారి కార్లను ఆపి తనిఖీ చేయగా రూ.7లక్షల విలువైన గంజాయి దొరికింది. అమీర్‌పై పాతబస్తీలోని పలు పోలీస్ స్టేషనల్లో గంజాయి కేసులు ఉన్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి 22 కేజీల గంజాయి, 5 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ కె. యాదగిరి, పోలీస్ సిబ్బందిని ఏసీపీ మధుసూదన్ రెడ్డి అభినందించారు.

సన్న బియ్యం పేరుతో మోసం

- ఇద్దరిని పట్టుకున్న డొంకతండా వాసులు

త్రిపురారం: రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా చెప్పి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న ఇద్దరిని త్రిపురారం మండలం డొంకతండావాసులు శనివారం పట్టుకున్నారు. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన దుర్గారావు, కాశిదాసు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని కొత్త బస్తాల్లో నింపి సన్న బియ్యం పేరుతో తక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. శనివారం వారిద్దరు స్కూటీపై త్రిపురారం మండలం డొంకతండాకు వచ్చి సన్న బియ్యం అంటూ రేషన్ బియ్యం అమ్ముతుండగా.. తండాకు చెందిన ధనావత్ దర్జీ అర క్వింటా బియ్యం రూ.2వేలకు కొనుగోలు చేసింది. విషయం తెలుసుకున్న మరికొందరు తండావాసులు దర్జీ ఇంటి వద్దకు వచ్చి బియ్యం కొనేందుకు బేరం ఆడుతూ.. బస్తాల్లో బియ్యాన్ని పరిశీలించగా అవి రేషన్ బియ్యంగా గుర్తించారు. దీంతో దుర్గారావు, కాశిదాసును నిలదీయగా వారు పారిపోయేందుకు యత్నించారు. వారిని తండావాసులు వెంబడించి దామరచర్ల మండలం మోదుగులతండా వద్ద పట్టుకొని డొంకతండాకు తీసుకొచ్చారు. గతంలోనూ వారు ఇదే తరహాలో బియ్యం అమ్మి మోసం చేసినట్లు తేలింది. నిందితుల నుంచి బియ్యం, స్కూటీని తండావాసులు స్వాధీనం చేసుకున్నారు.


డొంకతండా వాసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

● వేసవిలో మంచు దుప్పటి


హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ శివారులో శనివారం ఉదయం వేళ వరి పొలాలను కమ్మేసిన పొగ మంచు


హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేటలో కమ్ముకున్న మంచు – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూరు(ఎం): ఆర్టీసీ అద్దె బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో శనివారం జరిగింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్యామల రమేష్(34) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తాడు. అతడి భార్య కూలి పనులు చేస్తూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. శనివారం రమేష్ బైక్‌పై ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపురం ఎక్స్ రోడ్డు వద్ద రాయిగిరి–మోత్కూరు రోడ్డు వైపు మళ్లుతుండగా.. హైదరాబాద్–2 డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు మరిపెడ బంగ్లాకు వెళ్తూ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య తెలిపారు.


బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

కేతేపల్లి: మినీ వాహనంలో అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం కేతేపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన వికాస్‌కుమార్, మిథిలేష్ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మినీ వాహనంలో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఇనుపాముల జంక్షన్ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు వీరి వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో తరలిస్తున్న బియ్యం రేషన్ బియ్యం అని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

టాటా ఏస్ వాహనం దగ్ధం

కట్టంగూర్: ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా టాటా ఏస్ వాహనం దగ్ధమైంది. ఈ ఘటన కట్టంగూర్ మండలం కల్మెర గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం శివారులో శనివారం జరిగింది. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామంలో గేదెను తీసుకొచ్చేందుకు కట్టంగూర్ నుంచి టాటా ఏస్ వాహనంలో ఏనుగు కృష్ణ తన స్నేహితుడితో కలిసి బయల్దేరారు. మార్గమధ్యలో కల్మెర గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యనారాయపురం శివారులోకి వెళ్లగానే ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి టాటా ఏస్ వాహనంలో మంటలు లేచాయి. మంటలు గమనించిన కృష్ణ వెంటనే వాహనాన్ని నిలిపివేయగా.. అతడితో పాటు అతడి స్నేహితుడు వాహనం నుంచి కిందకు దిగారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వాహనం మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.8లక్షలు నష్టం వాటిల్లినట్లు వాహన యజమాని కృష్ణ తెలిపాడు.


కాలిపోయిన టాటా ఏస్ వాహనం

30న కవి సమ్మేళనం

రామగిరి(నల్లగొండ) : ఉగాది పండుగ సందర్భంగా సాహితీ మేఖల ఆధ్వర్యంలో ఈ నెల 30న నల్ల గొండ జిల్లా కేంద్రంలో కవి సమ్మేళనం, పురస్కారాలు ప్రధానోత్సవం చేయనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి పున్నమి అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రంగాచార్య (సాహిత్యరంగం), సిరికొండ శివ సుబ్రహ్మణ్యం (పద్య కవిత్వం), శిరంశెట్టి కాంతారావు (కథ/నవల), ప్రొఫెసర్ రుద్ర సాయి (శతాధిక పుస్తక రచయిత), చరణ్ అర్జున్ (మ్యూజిక్ డైరెక్టర్), కాసాల నర్సిరెడ్డి (సింగర్), సత్యనారాయణ (ఆధ్యాత్మిక సేవా రంగం), ఎల్వీ కుమార్ (సేవా రంగం)ను ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సమ్మేళనంలో పాల్గొనే వారు ఉగాది ప్రాముఖ్యత గురించి కవితలు రాయాలని కోరారు. దేవులపల్లి నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి: సూర్యాపేట ఎమ్మెల్యే జి. జగదీష్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడారు. జగదీష్‌రెడ్డిపై ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. వెంటనే ఎమ్మెల్యేపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బీరు మల్లయ్య, లక్ష్మీనారాయణ, రాజేందర్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, మల్లికార్జున్, ఇట్టబోయిన గోపాల్, తుమ్మల పాండు, సుభాష్, శంకర్, చిరంజీవి, సురేష్, జంగయ్య, ఇస్మాయిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ముఠా అరెస్ట్

- 2 మోటారు సైకిళ్లు, 4 సెల్‌ఫోన్లు, రూ.24,900 నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమంద రాజు, పక్కన ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్: బంగారం షాపుల యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను శనివారం సీఐ చరమంద రాజు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన చింతలచెర్వు ప్రశాంత్, చింతలచెర్వు అక్షిత్‌కుమార్, నల్లగొండ పట్టణానికి చెందిన షేక్ వాజిద్, షేక్ ఇర్ఫాన్ ముఠాగా ఏర్పడ్డారు. దురలవాట్లకు బానిసై, తేలికగా డబ్బులు సంపాదించాలానే ఉద్దేశంతో గూగుల్‌లో ఎస్‌ఐల ఫొటోలు డౌన్‌లోడ్ చేసుకొని ఆ ఫొటోలను ట్రూకాలర్, వాట్సాప్‌లో డీపీలుగా పెట్టుకొని బంగారం షాపు యాజమానుల వివరాలు సేకరించారు. బంగారం షాపుల యజమానులకు ఫోన్ చేసి తాము పలానా పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి 'మేము కొంత మంది దొంగలను పట్టుకున్నాం.. వారు దొంగిలించిన బంగారం మీ బంగారం షాపులో అమ్మారు.. ఆ బంగారం మీ నుంచి రికవరీ చేయాలి లేకపోతే కేసు పెట్టి జైలుకు పంపుతాం' అని బెదిరించేవారు. ఈ విధంగా బంగారు షాపుల యజమానుల నుండి డబ్బులు ఫోన్ పే చేయించుకుంటున్నారు. ఈ నెల 1వ తేదీన చింతలచెర్వు ప్రశాంత్ తిరుమలగిరికి చెందిన శివకుమార్ అనే జ్యువెలరీ షాపు యజమానికి ఫోన్ చేసి 'నేను రాజాంపేట్ ఎస్‌ఐని మాట్లాడుతున్నా.. నువ్వు దొంగల వద్ద బంగారం కొన్నావు.. నీ పైన కేసు కాకుండా ఉండాలంటే రూ.లక్ష ఫోన్ పే చెయ్యమని చెప్పాడు'. దీంతో శివకుమార్ భయపడి రూ.52 వేలు ఫోన్ పే ద్వారా పంపాడు. అదేవిధంగా ఈ నెల 8న హుజూర్‌నగర్‌లోని శ్రీనిధి జ్యువెలరీ షాపు యజమాని తుడిమల్ల నవీన్‌కుమార్‌కు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో అతడు భయపడి వారు చెప్పిన ఫోన్ పే నంబర్‌కు రూ.10 వేలు పంపారు. అనంతరం నవీన్‌కుమార్‌కు అనుమానం వచ్చి హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ముత్తయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఎస్‌ఐ ముత్తయ్య తన సిబ్బందితో గోపాలపురం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ప్రశాంత్, అక్షిత్‌కుమార్, వాజిద్, ఇర్ఫాన్ రెండు మోటార్ సైకిళ్లపై కోదాడ వైపు అనుమానాస్పదంగా వెళ్తుండగా.. పట్టుకుని విచారించగా వారు చేసిన నేరాలను అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 2 మోటార్ సైకిళ్లు, 4 సెల్‌ఫోన్లు, రూ.24,900 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వెయ్యేళ్ల నాటి శిల్పాలను పరిరక్షించాలి


పురాతన విగ్రహాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయంలో వెయ్యేళ్ల నాటి పురాతన శిల్పాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. శనివారం చెన్నకేశవ ఆలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. చెన్నకేశవ ఆలయంలో క్రీ.శ.1245 కాలం నాటి కాకతీయ రాజు గణపతిదేవుడి మంత్రి మంచన విగ్రహం, అదేవిధంగా 40 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు గల నల్ల శాసనపు రాతితో చెక్కిన చెన్నకేశవుని శిల్పాలు ఉన్నాయని తెలిపారు. వీటిని భద్రపర్చి భావితరాలను తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఆలయ పూజారి సిరికొండ అనంతకృష్ణమాచార్యులు తదితరులు ఉన్నారు.